ఓర్వకల్‌లో రహదారిని పరిశీలిస్తున్న సిపిఎం జిల్లా కార్యదర్శి గౌస్ దేశాయ్

గడువులోగా అర్జీలు పరిష్కారం

- జిల్లా కలెక్టర్ డాక్టర్ ఏ.సిరి

ప్రజాశక్తి - కర్నూలు కలెక్టరేట్

అర్జీలను గడువులోగా పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ ఏ.సిరి అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ సునయన ఆడిటోరియంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజల నుండి వినతులను కలెక్టర్ స్వీకరించారు. అనంతరం జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ పిజిఆర్ఎస్‌లో వచ్చిన దరఖాస్తులను నిర్ణీత గడువులోగా పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలన్నారు. పిజిఆర్ఎస్ లాగిన్‌లో పరిష్కారం చేసిన అర్జీలను ఆడిట్ చేయాల్సి ఉందన్నారు.. అర్జీల ఆడిట్ పెండింగ్ లేకుండా చూసుకోవాలన్నారు. గ్రామాల్లో, పట్టణాల్లో పారిశుధ్య కార్యక్రమాలను చేపట్టాలని, ఎక్కడైనా ఐవిఆర్ఎస్ ద్వారా పారిశుధ్య కార్యక్రమాలు సక్రమంగా నిర్వహించలేదని ఫిర్యాదులు వస్తే సంబంధిత సచివాలయ సిబ్బందిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. జడ్పీ సీఈవో, మున్సిపల్ కమిషనర్లు ఈ అంశంపై పర్యవేక్షించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ బి.నవ్య, డిఆర్‌ఒ సి.వెంకట నారాయణమ్మ, హౌసింగ్ పీడి చిరంజీవి, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ కొండయ్య, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

గ్రీవెన్స్ కార్యక్రమంలో అర్జీలను స్వీకరిస్తున్న జిల్లా కలెక్టర్ ఏ.సిరి

జిఎస్‌టి పన్నుల తగ్గింపుపై ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించాలి : కలెక్టర్

జీఎస్టీ పన్నుల తగ్గింపుపై ప్రజల్లో విస్తృతంగా అవగాహన కల్పించాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ ఏ.సిరి అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లోని సునయన ఆడిటోరియంలో సూపర్ జీఎస్టీ-సూపర్ సేవింగ్స్ పోస్టర్లను కలెక్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జీఎస్టీ పన్నుల తగ్గింపు వల్ల కలిగే లబ్ధి గురించి ఇంటింటికి వెళ్లి తెలియచేయాలన్నారు. జీఎస్టీ పన్నుల తగ్గింపు వల్ల కుటుంబానికి నెలకు దాదాపు రూ.1000 వరకు ప్రయోజనం కలుగుతుందన్నారు. దుకాణాల్లో పాత ఎమ్మార్పీ ధరలకే నిత్యావసర వస్తువుల అమ్ముతున్నారని వార్తలు వస్తున్న నేపథ్యంలో అలా జరుగకుండా తగిన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. డిఆర్‌డిఎ, మెప్మా, వ్యవసాయ శాఖ, విద్యా శాఖ తదితర శాఖల ఆధ్వర్యంలో గ్రామ, మండల, జిల్లా స్థాయిలో ర్యాలీలు, ప్రదర్శనలు, వ్యాస రచన, వక్తృత్వపు పోటీలు తదితర అవగాహనా కార్యక్రమాలను చేపట్టి, ప్రజలకు పూర్తి స్థాయిలో అవగాహన కల్పించాలన్నారు. జెసి బి.నవ్య, కమర్షియల్ ట్యాక్స్ జాయింట్ కమిషనర్ నీరజ, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

కొత్త రేట్లకే వస్తువులను అమ్మాలి : జీఎస్టీ పన్నుల సవరణ అనంతరం కొత్త రేట్లకే వస్తువులను అమ్మాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎ.సిరి వ్యాపార వాణిజ్య సంస్థల నిర్వాహకులను కోరారు. పాత రేట్లకు అమ్మే వారిపై తగిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కలెక్టరేట్ నుండి మండల స్పెషల్ ఆఫీసర్లు, డివిజన్, మండల స్థాయి అధికారులతో కలెక్టర్ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ ఐవీఆర్ఎస్‌కి సంబంధించి కొన్ని అన్న క్యాంటీన్‌లలో శానిటేషన్ పనులు సరిగా జరగడం లేదని ఫిర్యాదులు వస్తున్నాయన్నారు. భోజనం నాణ్యత సరిగా లేదని, సమయానికి అన్న కాంటీన్లు తెరవడం లేదనే ప్రజల నుండి నెగెటివ్ ఫీడ్ బ్యాక్ వచ్చిందన్నారు.. అన్న క్యాంటీన్‌లపై ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు. వీడియో కాన్ఫరెన్స్‌లో జెసి బి.నవ్య, డిఆర్‌ఒ సి.వెంకట నారాయణమ్మ, కమర్షియల్ ట్యాక్స్ జాయింట్ కమిషనర్ నీరజ, జిల్లా పరిషత్ సీఈఓ నాసర రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కొత్త రోడ్డు నిర్మాణం చేపట్టాలి

- సిపిఎం జిల్లా కార్యదర్శి గౌస్ దేశాయ్

ప్రజాశక్తి - కర్నూలు కలెక్టరేట్

ఓర్వకల్ మండల కేంద్రంలో అస్వస్థంగా తయారైన రోడ్డును తొలగించి కొత్తగా రోడ్డు నిర్మాణ పనులను చేపట్టాలని సిపిఎం జిల్లా కార్యదర్శి డి.గౌస్ దేశాయ్ డిమాండ్ చేశారు. సోమవారం ఓర్వకల్లు మండల కేంద్రంలో అస్తవ్యస్తంగా తయారైన రహదారిని సిపిఎం ప్రతినిధి బృందం పరిశీలన చేసింది. ఈ సందర్భంగా డి.గౌస్ దేశాయ్ మాట్లాడుతూ ఓర్వకల్ మండల కేంద్రం ప్రారంభం నుండి వెళ్లాలంటేనే ప్రజలు బురదలో వెళ్లాల్సిన పరిస్థితి వస్తుందన్నారు. ద్విచక్ర వాహనాలలో వెళ్లే ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. వాహనాల్లో, కాలినడకలో వెళ్లేవారు జారీ కింద పడుతున్నారని చెప్పారు. పారిశ్రామిక కేంద్రంలో ఇలా ఉంటే ఇతర గ్రామాల్లో ఎలాంటి పరిస్థితి ఉంటుందో అర్థం చేసుకోవచ్చన్నారు. తాత్కాలిక మరమ్మతుల పేరుతో మట్టి, చిప్స్ వేస్తున్నారని, అది పరిష్కారం కాదన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి గ్రామం ప్రారంభం నుండి చివరి దాకా సిసి రోడ్డు వేయాలని, అలా వేయని పక్షంలో ఉద్యమిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి బి.నాగన్న, మండల నాయకులు చంద్రబాబు నాయుడు, హమాలీ సంఘం నాయకులు కేశాలు, ఎల్లరాజు, గ్రామస్తులు పాల్గొన్నారు.

మహిళల ఆరోగ్యానికి ప్రాధాన్యత

- పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరిత రెడ్డి
- జిజిహెచ్‌లో మెగా హెల్త్ క్యాంప్

ప్రజాశక్తి - కర్నూలు హాస్పిటల్

మహిళల ఆరోగ్యానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అధిక ప్రాధాన్యత ఇస్తున్నాయని పాణ్యంఎమ్మెల్యే గౌరు చరిత రెడ్డి పేర్కొన్నారు. స్వస్త్ నారి సశక్త్ పరివార్ అభి యాన్ కార్యక్రమంలో బాగంగా సోమవారం కర్నూలు సర్వజన ఆసుపత్రిలో మహిళల ఆరోగ్యంపై మెగా హెల్త్ క్యాంప్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి హాజరై మాట్లాడారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా కుటుంబ సంక్షేమ శాఖ ద్వారా ఈ నెల 17 నుండి అక్టోబర్ 2వ తేదీ వరకు రెండు వారాల పాటు స్వస్త్ నారి సశక్త్ అభియాన్ కార్యక్రమానికి సంబంధించి జిల్లా లోని అన్ని గ్రామీణ, పట్టణ ఆరోగ్య కేంద్రాలు, ఆరోగ్య ఉప కేంద్రాలు, ఏరియా హాస్పిటల్స్, సామాజిక ఆరోగ్య కేంద్రాలలో ప్రత్యేక వైద్య శిబిరాలలో వైద్య సేవలు అందిస్తున్నారని తెలిపారు. మహిళలలో గుండె జబ్బులు, మధు మేహం, నోటి కాన్సర్, గర్భాశయ కాన్సర్‌ల పరీక్షలు చేసి తగిన వైద్య చికిత్సలను, రెఫరల్ సేవలను అందిస్తున్నట్లు చెప్పారు. మహిళలు, కిషోర బాలికలలో రక్త హీనతను గుర్తించి తగిన చికిత్సలను అందిస్తున్నారని అన్నారు. గర్భవతులను పరిక్షించి సరైన పోషకాహారం ఆవశ్యకతను, తీసుకోవల్సిన జాగ్రత్తలపై కౌన్సిలింగ్ ఇస్తున్నారని తెలిపారు. అనంతరం అక్కడే ఏర్పాటుచేసిన స్టాళ్లను సందర్శించి వివిధ కార్యక్రమాల గురించి అడిగి తెలుసుకొన్నారు. కార్యక్రమంలో ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కె.వెంకటేశ్వర్లు, మెడికల్ కాలేజీ ఇంచార్జి ప్రిన్సిపాల్ డాక్టర్ సాయిసుధీర్, నోడల్ అధికారి, జనరల్ సర్జరీ ప్రొఫెసర్ డాక్టర్ మాధవీ శ్యామల, జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ పి.శాంతికళ, ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టరు రామాంజనేయులు, డిఐవో డాక్టర్ ఉమ, డిఎస్ఒ డాక్టర్ నాగప్రసాద్ బాబు తదితరులు పాల్గొన్నారు.

అవయవ దానం కోసం జీవన్ ధాన్‌లో పేరు నమోదు చేసుకున్న ఎమ్మెల్యే

తమ మరణాంతరం కూడా జీవించి ఉండాలంటే మరొకరికి అవయవదానం చేయడంతోనే అది సాధించవచ్చని, అందుకే జీవన్ ధాన్ వెబ్‌సైట్‌లో తన పేరును నమోదు చేయాలని ప్రభుత్వ సర్వజన వైద్యశాల సూపర్డెంట్ అడిషనల్ డియంఈ డాక్టర్ వెంకటేశ్వర్లుని ఎమ్మెల్యే కోరారు. అవయవదానానికి స్వచ్ఛందంగా ముందుకు రావడం పట్ల ఎమ్మెల్యే గౌరు చరిత రెడ్డిని సూపరింటెండెంట్ అభినందించారు. సర్టిఫికెట్‌ని డౌన్లోడ్ చేసి పత్రం అందజేశారు.

మాట్లాడుతున్న పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరిత రెడ్డి

ఆదోని ఎమ్మెల్యే తీరుపై 'కూటమి' గుర్రు..

- బిజెపితో మైత్రి బంధం తెగనుందా..?
- ఎమ్మెల్యే తీరు పట్ల టిడిపి, జనసేన నాయకులు అసహనం

ప్రజాశక్తి - ఆదోని

ఆదోని నియోజకవర్గంలో బిజెపి, టిడిపి మధ్య మైత్రి బంధం తెగిపోయే అవకాశాలు కనిపిస్తున్నాయి. టిడిపి, జనసేన సహకారంతో ఆదోని నియోజకవర్గంలో బిజెపి తరపున బరిలో నిలిచి నెగ్గిన ఎమ్మెల్యే పార్థసారథి ఒంటెద్దుపోకడ వల్ల కూటమి నాయకులు ఇబ్బందులు పడుతున్నారు. నియోజకవర్గంలో అభివృద్ధి కార్యక్రమాలు, ప్రజల సమస్యలు తెలుసుకునేందుకు నిర్వహించే పర్యటనలకు కనీసం సమాచారం టిడిపి, జనసేన నాయకులకు సమాచారం ఇవ్వడం లేదని ఆ పార్టీల నాయకులు చెబుతున్నారు. తమ ఓట్లతో గద్దెనెక్కి అంతా తమదే అంటే చూస్తూ ఊరుకోమని ఎమ్మెల్యే తీరుపై టిడిపి నాయకులు, కార్యకర్తలు పలుమార్లు బహిరంగగానే విమర్శలు చేసిన సందర్భాలు ఉన్నాయి. మొదట్లో మీనాక్షి నాయుడు తండ్రి లాంటి వాడని, ఆయన సహకారంతోనే గెలిచానని పదే పదే చెప్పిన పార్థసారథి ఎమ్మెల్యేగా నెగ్గిన తర్వాత ప్రమాణం స్వీకారం తర్వాత నెల రోజులు కాకముందే అందరిని దూరం పెట్టారని అప్పట్లో చర్చ నడిచింది. ఇరువురు ఒకరిపై ఒకరు విమర్శలు చేసుకున్న సందర్భాలూ ఉన్నాయి. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, మధ్యాహ్న భోజనం, ఫీల్డ్ అసిస్టెంట్లు, డీలర్లు, బుక్ కీపర్లు వంటి పోస్టులలో టిడిపి వారికి అవకాశం ఇవ్వకుండా అంత తానే అంటూ ఎమ్మెల్యే వ్యవహరించారని చెబుతున్నారు. అంతా గమనిస్తున్న టిడిపి నాయకులు, కార్యకర్తలు గతంలో భగ్గు మన్నారు. కర్నూలు ఇన్చార్జి మంత్రి రామ నాయుడుతో కర్నూల్‌లో మీనాక్షి నాయుడు అనుచరులు వాగ్వాదానికి దిగి నిరసన వ్యక్తం చేసినట్లు దుమారం లేచింది. ఓ మెట్టు దిగిన ఎమ్మెల్యే కొన్ని డీలర్ పోస్టులు, బుక్ కీపర్లు, ఫీల్డ్ అసిస్టెంట్ పోస్టులు టిడిపి, జనసేన శ్రేణులకు అవకాశం కల్పించారు. అయినా ఎమ్మెల్యే తీరు పట్ల టిడిపి, జనసేన నాయకులు అసంతృప్తితోనే ఉన్నారని పలు సందర్భాల్లో బయటపడింది.

బిజెపి నాయకులపై మీనాక్షి నాయుడు ఫైర్ : ఆదోని పట్టణంలోని రాజరాజేశ్వరి నగర్‌లోని వెలసిన రాజరాజేశ్వరి మాత ఆలయం వ్యవహారంలో బిజెపి నాయకుల తీరు అభ్యంతరకరమని పట్టణ ప్రముఖులతో కలిసి ఆలయంలోనే మీనాక్షి నాయుడు ఫైర్ అయ్యారు. ఆలయ నిర్వాహకురాలు మృతి పట్ల అనుమానాలు ఉన్నాయని బిజెపి నాయకులు సబ్ కలెక్టర్ కార్యాలయం ముందు నిరసన చేస్తూ డిఎస్పికి అప్పట్లో ఫిర్యాదు చేశారు. సున్నితమైన సమస్య పట్ల బిజెపి నాయకులు రాద్ధాంతం చేయడం ఏమిటని అధికారంలో టిడిపి ఉందన్న సంగతి గమనించడం లేదా అంటూ మాజీ ఎమ్మెల్యే మీనాక్షి నాయుడు నిలదీయడంతో చర్చనీయాంశమైంది. రూ.100 కోట్లు ఆస్తులు ఆలయానికి ఉన్నాయని తప్పుడు ఆరోపణలు చేసి భక్తుల మనోభావాలు దెబ్బతీసే ప్రయత్నాలు చేయడం తగదని మీనాక్షి నాయుడు అభ్యంతరం వ్యక్తం చేశారు

పట్టు బిగించిన టిడిపి : సింగిల్ విండో చైర్మన్లు, మార్కెట్ యార్డ్ చైర్మన్ పదవులలో మీనాక్షి నాయుడు పై చేయి సాధించారు. అధికారుల్లో కూడా మీనాక్షి నాయుడు పట్ల గౌరవం పెరిగిందని ఆ పార్టీ నాయకులు చెబుతున్నారు. ఇప్పుడిప్పుడే పట్టు బిగిస్తున్నామని ఆ పార్టీ నాయకులు ధీమా వ్యక్తం చేస్తున్నారు. ఎమ్మెల్యే పార్థసారథి ప్రభావం తగ్గించేందుకే ఎమ్మెల్సీ బిటి నాయుడుకు మున్సిపాలిటీలో ఎక్స్ అఫీషియ సభ్యుడుగా పదవి బాధ్యతలు చేపట్టేలా టిడిపి నాయకులు ఎత్తుగడలు వేశారని పలువురు చెబుతున్నారు. ప్రమాణ స్వీకారం కూడా టిడిపి నాయకులు పెద్ద ఎత్తున నిర్వహించడం పట్ల రాజకీయంగా ప్రాబల్యం పెంచుకునే ఎత్తుగడలో భాగమని చెబుతున్నారు. ఎన్నడూ లేని విధంగా సమస్య పరిష్కరించాలని ప్రభుత్వ కార్యాలయం ముందు బిజెపి ఆధ్వర్యంలో నిరసనలు చేయడం, అధికారులకు వినతి పత్రాలు ఇవ్వడం చేస్తున్నారని ఏమిటంటూ పలువురు పేర్కొంటున్నారు. బిజెపి నాయకులు, కార్యకర్తలు ఇంత రాద్ధాంతం చేస్తున్నా ఎమ్మెల్యే పార్థసారథి ఎందుకు మౌనంగా ఉన్నారని ప్రజల్లో చర్చ జరుగుతుంది. ఆదోనిలో ఏ పని జరిగినా పర్సంటేజ్ వసూలు చేస్తున్నారని, ఇటీవల ఓ లారీ ఆపి డబ్బు డిమాండ్ చేసిన వాయిస్ రికార్డు సోషల్ మీడియాలో వైరల్ అయింది. కొత్త సంస్కృతికి తెర లేపారని బిజెపి నాయకుల పట్ల పలువురు విమర్శలు చేస్తున్నారు. ఆదోనిలో మాత్రం ఎమ్మెల్యే పార్థసారథి బిజెపి కండువా వేసుకున్న వాళ్లకు మాత్రమే పనులు చేయాలని అధికారులకు హుకుం జారీ చేసినట్లు చర్చ నడుస్తుంది. తామంతా ఒకటేనని చెబుతున్నా లోలోన మాత్రం ఎవరి ఎత్తుగడలు వారే వేస్తున్నట్లు ప్రజలు చర్చించుకుంటున్నారు. తమకు పనులు జరగడం లేదని ఎమ్మెల్యే పట్ల టిడిపి, జనసేన నాయకులు అసంతృప్తితో ఉన్నారనేది బహిరంగ రహస్యమే.

భాస్కర్ రావుకు సన్మానం చేస్తున్న ఎస్పీ విక్రాంత్ పాటిల్

ఎఆర్ డీఎస్పీ భాస్కర్ రావుకు సన్మానం

ప్రజాశక్తి - కర్నూలు క్రైమ్

సుదీర్ఘ కాలం పోలీసు శాఖలో పని చేసి విరమణ పొందడం అభినందనీయమని ఎస్పీ విక్రాంత్ పాటిల్ తెలిపారు. సోమవారం ఎస్పీ క్యాంపు కార్యాలయంలో విరమణ పొందిన ఎఆర్ డీఎస్పీ కె.భాస్కర్ రావుకు, వెల్దుర్తి ఎఎస్ఐ బి.శివరామిరెడ్డికి ఎస్పీ శాలువా, పూలమాల వేసి సన్మానించి, జ్ఞాపికను అందజేశారు. విరమణ అనంతరం కుటుంబాలతో సంతోషంగా గడపాలని, సమస్యలుంటే నేరుగా తనను సంప్రదించవచ్చని ఎస్పీ తెలిపారు. అడిషనల్ ఎస్పీ అడ్మిన్ హుస్సేన్ పీరా, కర్నూలు డీఎస్పీ జె.బాబు ప్రసాద్, సిఐలు తేజమూర్తి, కేశవ రెడ్డి, శివశంకర్, గుణశేఖర్ బాబు, వేణుగోపాల్, ఆర్ఐలు జావేద్, నారాయణ, జిల్లా పోలీసు అధికారుల సంఘం అధ్యక్షులు నాగరాజు పాల్గొన్నారు.

'పరిష్కార వేదిక'కు 79 ఫిర్యాదులు

ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికకు 79 ఫిర్యాదులు అందాయని ఎస్పీ విక్రాంత్ పాటిల్ తెలిపారు. నగరంలోని టూ టౌన్ పోలీసు స్టేషన్ పక్కన ఉన్న ఎస్పీ క్యాంపు కార్యాలయంలో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక నిర్వహించారు. జిల్లాలో వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజలు వినతులను ఎస్పీ అందజేశారు. ఎస్పీ ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికకు వచ్చిన ఫిర్యాదులపై చట్ట ప్రకారం విచారణ జరిపి, బాధితులకు న్యాయం చేస్తామని ఎస్పీ హామీ ఇచ్చారు. అడిషనల్ ఎస్పీ అడ్మిన్ హుస్సేన్ పీరా, సిఐలు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

ప్రజాశక్తి - కోడుమూరు

కోడుమూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 10వ తరగతి (1997-98)కి చెందిన పూర్వ విద్యార్థులు సోమవారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. 27 ఏళ్ల తర్వాత కలుసుకున్న స్నేహితులు తాము చదువుకున్న రోజులను గుర్తు చేసుకున్నారు. తమకు విద్యాబుద్ధులు నేర్పిన గురువులను సన్మానించారు. పూర్వపు విద్యార్థులు ఉపాధ్యాయులతో కలిసి సహపంక్తి భోజనాలు చేశారు. అనంతరం ఫొటోలు దిగి మధుర స్మృతులను నెమరేసుకున్నారు. ఉన్నత స్థానాలకు ఎదిగిన విద్యార్థులను చూసి గురువులు ఆనందించారు. అంతకుముందు తమకు విద్యాబుద్ధులు నేర్పిన ఉపాధ్యాయు లను గ్రామంలో ఊరేగింపుగా సంబరాలు చేసుకుంటూ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల వరకు వెళ్లి సమావేశం ఏర్పాటు చేశారు.

సమ్మేళనంలో పాల్గొన్న పూర్వపు విద్యార్థులు

వర్షాలతో నష్టపోయిన రైతులను ఆదుకోవాలి

- ఎకరాకు రూ. 50 వేలు నష్టపరిహారం ఇవ్వాలి
- రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి జి.రామకృష్ణ

ప్రజాశక్తి - కర్నూలు కలెక్టరేట్

అధిక వర్షాల వల్ల నష్టపోయిన రైతులకు ఎకరాకు రూ.50 వేలు నష్టపరిహారం ఇవ్వాలని ఎపి రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి జి.రామకృష్ణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం ఓర్వకల్లు తహశీల్దార్ విద్యాసాగర్‌కు ఎపి రైతు సంఘం ఆధ్వర్యంలో వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో పత్తి 4 వేల ఎకరాలు, ఉల్లి 1084 ఎకరాలు, మొక్కజొన్న 5000 ఎకరాల్లో రైతులు సాగు చేశారని తెలిపారు. అకాల వర్షాల వలన పంటలు నీట మునిగి తీవ్రంగా దెబ్బతిన్నాయని చెప్పారు. పంటల సాగుకు పెట్టుబడి ఖర్చులు బాగా పెరిగిపోయాయని తెలిపారు. దిగుబడి తగ్గి వచ్చిన పంటలకు ధరలు లేక రైతులు తీవ్ర నష్టాలపాలవుతున్నారని చెప్పారు. మరొక పక్క అధిక వర్షాల వల్ల పంటలు నీట మునిగిపోయి రైతులు తీవ్రంగా నష్టపోతున్నారన్నారు. మండలంలో వర్షాలతో నీట మునిగిన అన్ని పంటలకు తగిన నష్టపరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. తహశీల్దార్ స్పందిస్తూ సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకుకెళ్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో రైతు సంఘం మండల కార్యదర్శి చంద్రబాబు నాయుడు, నాయకులు ముత్తు, రమణారెడ్డి, వెంకటేశ్వర్లు, భాస్కర్ పాల్గొన్నారు.

వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

పారదర్శకంగా ప్రజా పంపిణీ వ్యవస్థ : ఎమ్మెల్యే

ప్రజాశక్తి - కర్నూలు హాస్పిటల్

ప్రజా పంపిణీ వ్యవస్థను మరింత పారదర్శకంగా, సమర్ధవంతగా అమలు చేసేందుకు ప్రభుత్వం స్మార్ట్ కార్డులను లబ్ధిదారులకు అందజేస్తుందని పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరిత రెడ్డి అన్నారు. సోమవారం కల్లూరు మండలం పెద్దటేకూరు గ్రామంలో స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరితా రెడ్డి హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ స్మార్ట్ రేషన్ కార్డు ద్వారా లబ్ధిదారులు వారికి వచ్చే రేషన్ వివరాలు, సభ్యుల వివరాలు, ఇచ్చే సరకులు వాటి వివరణ క్యూ ఆర్ కోడ్ ద్వారా తెలుసుకోవచ్చని తెలిపారు. లబ్ధిదారులు సమస్యలను తెలియజేసేందుకు ఈ స్మార్ట్ రేషన్ కార్డుా టోల్ ఫ్రీ హెల్ప్ లైన్ నంబర్ 1967 ను కూడా ముద్రించినట్లు చెప్పారు. సూపర్ జిఎస్‌టి-సూపర్ సేవింగ్స్ గురించి ప్రజలందరూ తెలుసుకోవా లన్నారు. అలాగే ప్రభుత్వ పథకాలను వివరించారు. కల్లూరు స్పెషల్ ఆఫీసర్ కె.ఆంజనేయులు, ఎంపీడీఓ జిఎన్ఎస్‌రెడ్డి, ఎంపీటీసీ మునిస్వామి, సర్పంచ్ పద్మావతమ్మ, తడకనపల్లె సర్పంచ్ సహారాబీ, నాయకులు మాదేష్, దేవేంద్ర రెడ్డి పాల్గొన్నారు.

స్మార్ట్ రేషన్ కార్డులను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే



అదనపు కమిషనర్‌కు వినతిపత్రం అందజేస్తున్న సుధాకరప్ప, నాయకులు

రోడ్లు, కాలువలు ఏర్పాటు చేయాలి : సిపిఎం

ప్రజాశక్తి - కర్నూలు కార్పొరేషన్

కల్లూరు 35వ వార్డు శివప్ప నగర్ కాలనీలో రోడ్లు, కాలువలు ఏర్పాటు చేయాలని సిపిఎం నగర కార్యదర్శి వర్గసభ్యులు కె.సుధాకరప్ప, నగర కమిటీ సభ్యులు కె.రామకృష్ణ, వార్డు కార్యదర్శి బి.పరమేష్, సూర్యనారాయణ కోరారు. సోమవారం మున్సిపల్ కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదికలో అదనపు కమిషనర్ ఆర్‌జివి.కృష్ణకు వినతిపత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ... ఈ కాలనీ ఏర్పడి దాదాపు 20 ఏళ్లవుతోందని తెలిపారు. చింతలముని నగర్‌లో ఉన్న ఓవర్ హెడ్ ట్యాంక్ ఎదురుగా ఉన్న శివప్ప నగర్ కాలనీలో పేదలు నివాసం ఉంటున్నారని చెప్పారు. కాలువలు లేకపోవడంతో మురుగునీరు రోడ్లపై పారి దుర్వాసన వెదజల్లుతోందని తెలిపారు. 35వ వార్డు శివప్ప నగర్‌లో పర్యటించి సిసి రోడ్లు, కాలువలు ఏర్పాటు చేయాలని కోరారు. సంబంధిత అధికారులు కాలనీలో పర్యటించి సమస్యను పరిష్కరించాలని అదనపు కమిషనర్ ఆర్‌జివి.కృష్ణ ఆదేశాలు జారీ చేశారు. జె.శ్రీనివాసులు, పి.మాధవ్, రాజన్న పాల్గొన్నారు.

మౌలిక వసతులు కల్పించండి

ప్రజాశక్తి - కర్నూలు కార్పొరేషన్

నగరంలోని తమ కాలనీల్లో మౌలిక వసతులు కల్పించాలని వివిధ కాలనీలకు చెందిన ప్రజలు నగరపాలక అధికారులకు అర్జీలు సమర్పించారు. సోమవారం స్థానిక ఎస్‌బిఐ ఎంప్లాయిస్ కాలనీలోని నగరపాలక సమావేశ భవనంలో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక నిర్వహించారు. అదనపు కమిషనర్ ఆర్‌జివి.కృష్ణ, డిప్యూటీ కమిషనర్ సతీష్‌కుమార్ రెడ్డిలు వినతులు స్వీకరించారు. వివిధ విభాగాలకు సంబంధించి పిజిఆర్ఎస్‌కి 26 వినతులు వచ్చాయి. మేనేజర్ చిన్నరాముడు, ప్రజారోగ్య అధికారి డాక్టర్ విశ్వేశ్వరరెడ్డి, ఇన్‌ఛార్జీ ఎస్ఇ శేషసాయి, ఆర్‌ఓలు జునైద్, స్వర్ణలత, వాజిద్, హార్టికల్చర్ ఎడి విజయలక్ష్మి, డిసిపి వెంకటరమణ, పారిశుధ్య పర్యవేక్షణాధికారి నాగరాజు, టిడ్కో అధికారి పెంచలయ్య హాజరయ్యారు.

23, 24వ వార్డుల్లో సమస్యలు పరిష్కరించాలి : సిపిఎం

నగరంలోని 23, 24వ వార్డుల్లోని సమస్యలను పరిష్కరించాలని సిపిఎం నాయకులు కోరారు. సోమవారం సిపిఎం జిల్లా నాయకులు గురుశేఖర్, నగర కార్యదర్శి వర్గసభ్యులు ఆర్.నరసింహులు, నగర నాయకులు సి.శేషాద్రి, శ్రీనివాసులు అదనపు కమిషనర్ ఆర్‌జివి.కృష్ణకు వినతిపత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ... 23వ వార్డు శ్రీరామ నగర్‌లో కల్వర్టులపై మ్యాన్ హోల్ మూతలు విరిగిపోవడంతో వాహనదారులు గుంతలో పడి ప్రమాదాలకు గురవుతున్నారని తెలిపారు. మ్యాన్ హోల్స్‌కు మూతలు వేయాలని అధికారులను కోరినా సమస్య పరిష్కారం కాలేదని, మూతలు ఏర్పాటు చేసి ప్రమాదాలు జరగకుండా చూడాలని కోరారు. అలాగే సిమెంటు రోడ్డు శిథిలమై పదేళ్లు కావస్తోందని, సిమెంట్ రోడ్డు వేయాలని తెలిపారు. ఆయన స్పందిస్తూ... వాహనదారులు ప్రమాదాలకు గురి కాకుండా కల్వర్టులపై మూతలు వేయిస్తామని, కొత్త సిమెంట్ రోడ్డు వేయిస్తామని హామీ ఇచ్చారు.

వినతి పత్రం అందజేస్తున్న సిపిఎం నాయకులు

రూ.999కే గుండె ప్రత్యేక చెకప్ ప్యాకేజీ

- మెడికవర్ హాస్పిటల్స్ హెడ్ డాక్టర్ మహేశ్వర్‌రెడ్డి

ప్రజాశక్తి - కర్నూలు హాస్పిటల్స్

ప్రపంచ హృదయ దినోత్సవం సందర్భంగా ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని కేవలం రూ.999కే గుండె ప్రత్యేక చెకప్‌ను ప్రారంభించినట్లు మెడికవర్ హాస్పిటల్స్ హెడ్ డాక్టర్ వై.మహేశ్వర్ రెడ్డి తెలిపారు. సోమవారం డాక్టర్ వై.మహేశ్వర్ రెడ్డి ఎస్పీ విక్రాంత్ పాటిల్ తన కార్యాలయంలో ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడారు. ప్రస్తుత కాలంలో గుండె సంబంధిత సమస్యలు వృద్ధుల్లోనే కాకుండా యువతలో కూడా వేగంగా పెరుగుతున్నాయని, జీవనశైలి, ఒత్తిడి, శారీరక వ్యాయామ లోపం, జంక్ ఫుడ్ వాడకం కారణంగా గుండె జబ్బులు అధికమవుతున్నాయ ని తెలిపారు. ప్రతి ఒక్కరూ క్రమం తప్పకుండా హెల్త్ చెకప్స్ చేయించుకోవాలని సూచించారు. తొందరగా గుర్తిస్తే గుండె సంబంధిత వ్యాధులను నివారించవచ్చని తెలిపారు. డాక్టర్ మహేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ... ప్రత్యేక ప్యాకేజీలో గుండె సంబంధిత ప్రాథమిక పరీక్షలతో పాటు ఇతర ముఖ్యమైన ఆరోగ్య పరీక్షలు ఉంటాయని తెలిపారు. ఈ ప్యాకేజీలో ఈసీజీ, టుడి ఎకో, టిఎంటి, లిపిడ్ ప్రొఫైల్, ఆర్‌బిఎస్, కార్డియాలజిస్ట్ కన్సల్టేషన్ ఉంటాయని చెప్పారు. అలాగే కన్సల్టెంట్ కార్డియాలజిస్టు డాక్టర్ బిఎస్.ప్రవీణ్ కుమార్ మాట్లాడుతూ... సమగ్రమైన హృదయ సంరక్షణను అందించడానికి మెడికవర్ హాస్పిటల్ సిబ్బంది అంకితమై ఉందని తెలిపారు.

చెకప్‌ను ప్రారంభిస్తున్న ఎస్పీ విక్రాంత్ పాటిల్

వెంకటేశ్వర్లు సేవలు అభినందనీయం

- కెఎమ్‌సి ప్రిన్సిపల్ డాక్టర్ చిట్టి నరసమ్మ

ప్రజాశక్తి - కర్నూలు హాస్పిటల్

రీజనల్ కంటి ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ వెంకటేశ్వర్లు సేవలు అభినందనీయవని కర్నూలు మెడికల్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ కె.చిట్టి నరసమ్మ తెలిపారు. సోమవారం రీజనల్ కంటి హాస్పిటల్ ఆస్పత్రిలో విరమణ తీసుకున్న ప్రొఫెసర్ డాక్టర్ వెంకటేశ్వర్లును కళాశాల ప్రిన్సిపల్, వైస్ ప్రిన్సిపల్స్, వివిధ విభాగ ప్రొఫెసర్స్, సిబ్బంది సన్మానించారు. ఆమె మాట్లాడుతూ... ప్రాంతీయ కంటి హాస్పిటల్ సూపరింటెండెంట్‌గా వెంకటేశ్వర్లు ఎన్నో ఇన్నోవేటివ్ కార్యక్రమాలు చేపట్టారని తెలిపారు. డాక్టర్ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ... ఎంతో మంది విద్యార్థులు ఉన్నత స్థాయిలో ఉన్నారని తెలిపారు. వైస్ ప్రిన్సిపల్స్ డాక్టర్ సాయి సుధీర్, డాక్టర్ హరి చరణ్, డాక్టర్ సింధియా శుభ ప్రద, డిప్యూటీ డాక్టర్ శ్రీరాములు, క్యాన్సర్ ఇనిస్టిట్యూట్ డైరెక్టర్ డాక్టర్ ప్రకాష్ పాల్గొన్నారు.

వెంకటేశ్వర్లును సన్మానిస్తున్న వైద్యులు

ప్రజా సమస్యలను పరిష్కరించండి

- సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్

ప్రజాశక్తి - ఆదోని

వినతులు స్వీకరిస్తున్న సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్

అర్జీలను ఏ ఒక్క అధికారి నిర్లక్ష్యం చేయకుండా ఎప్పటికప్పుడు పరిష్కరించి అర్జీదారులు సంతృప్తిచెందేలా చూడాలని సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్ తెలిపారు. సోమవారం సబ్ కలెక్టర్ కార్యాలయంలో 'పబ్లిక్ గ్రీవెన్స్ రిడ్రెసెల్ సిస్టం'లో డివిజన్లోని ఆదోని మండలాల నుంచి వచ్చిన ప్రజల నుంచి వినతులను స్వీకరించారు. మండలంలోని ఆయా శాఖల అధికారులకు సంబంధించిన సమస్యలను తెలియజేస్తూ గడువులోపు పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఎట్టి పరిస్థితుల్లోనూ బియాండ్ ఎస్ఎల్ఎలోకి వెళ్లకుండా చూడాలన్నారు. కార్యాలయపు పరిపాలన అధికారి వసుంధర, డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ సర్వేయర్ వేణు సూర్య, శ్రీనివాసరాజు, డిఎల్‌పిఒ తిమ్మక్క, డిఎల్‌డిఒ బాలకృష్ణారెడ్డి, ఆర్అండ్‌బి ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ పద్మనాభ రెడ్డి, గృహ నిర్మాణ శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ చంద్రశేఖర్, డిప్యూటీ డిఎంహెచ్ఒ డాక్టర్ సత్యవతి, ఆర్‌టిఒ కార్యాలయపు పరిపాలన అధికారి రమాదేవి, డిప్యూటీ తహశీల్దార్ బాబు ఉన్నారు.

కౌన్సిల్‌పై అధికారుల నిర్లక్ష్యం

- పోడియం ముందు కౌన్సిలర్ల బైఠాయింపు

ప్రజాశక్తి - ఆదోని

కౌన్సిల్‌ను అధికారులు నిర్లక్ష్యం చేస్తున్నారని, సమావేశానికి వచ్చి దండగ అంటూ కౌన్సిలర్లు అసహనం వ్యక్తం చేశారు. సోమవారం ఛైర్పర్సన్ లోకేశ్వరి అధ్యక్షతన కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. కౌన్సిల్ హాలులోకి సభ్యులు చేరుకొని అరగంట అయినప్పటికీ మున్సిపల్ అధికారులు రాకపోవడం కౌన్సిల్‌ను అవమానించడమేనని కౌన్సిలర్లు తెలిపారు. సమావేశం అంటే అధికారులకు ఏమాత్రం చిత్తశుద్ధి లేదని కౌన్సిలర్ బాలాజీ అసంతృప్తి వ్యక్తం చేశారు. అధికారులు లేని సమావేశంలో సమస్యలు ఎవరికి చెప్పాలని ఛైర్పర్సన్ లోకేశ్వరిని ప్రశ్నించారు. గంట తర్వాత కౌన్సిల్ హాలులోకి చేరుకున్న కమిషనర్ కృష్ణ మాట్లాడుతూ... కలెక్టర్ వీడియో కాన్ఫరెన్స్ ఉండడం వల్ల ఆలస్యమైందని తెలిపారు. ఎస్‌కెడి కాలనీలోని 5వ రోడ్డులో కుళాయిలో ఒండ్రు నీరు వస్తోందని, అధికారులకు విన్నవిస్తున్నా కనీసం కన్నెత్తి కూడా చూడడం లేదని కౌన్సిలర్లు బాలాజీ, లక్ష్మీదేవి వాపోయారు. ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల వద్ద కుళాయి వేయాలని, ఇఎస్ఐ ఆస్పత్రి వద్ద గోడ నిర్మించడం వల్ల డ్రెయినేజీ లేకపోవడంత ఇళ్ల మధ్యలోకి నీరు వస్తున్నాయని, సమస్యను పరిష్కరించాలని కౌన్సిలర్ లక్ష్మీదేవి కౌన్సిల్ దృష్టికి తెచ్చారు. అధికారులకు ఫోన్ చేసి సమాచారం తెలిపినా పరిష్కరించడం లేదని, ఇలా నిర్లక్ష్యం చేయడం తగదంటూ కౌన్సిలర్ రఘునాథ్ రెడ్డి తెలిపారు. వార్డు సమస్యలను పరిష్కరించడంలో నిర్లక్ష్యం చేస్తున్నారని కౌన్సిలర్ బాలాజీ డిఇలు రామ్మూర్తి, గోపీనాథ్‌పై ఆగ్రహం వ్యక్తం చేశారు. వార్డులో పర్యటించేటప్పుడు మాట మాత్రమే చెప్పడం లేదని, అధికారుల తీరు మార్చుకోవాలని తెలిపారు.

సమావేశంలో మాట్లాడుతున్న కౌన్సిలర్లు

ఛైర్మన్ లోకేశ్వరి

సమస్యలు పరిష్కరించాలని బైఠాయింపు

కొండలపేట, పర్ని మహల్, కని మహల్, నిజాముద్దీన్ కాలనీ ప్రాంతాల్లో సమస్యలు పరిష్కరించాలని కౌన్సిలర్లు హసీనా భాను, ఫయాజ్ అహ్మద్, ఉస్మాన్ పోడియం ముందు బైఠాయించారు. ఇటీవల కురిసిన వర్షాల వల్ల వాగులు, వంకలు ఉప్పొంగి ఇళ్లలోకి నీరు చేరాయని వాపోయారు. కౌన్సిలర్‌గా ఎన్నికై మూడేళ్లు సమయమైనప్పటికీ తమ వార్డులో ఒక్క అభివృద్ధి కార్యక్రమం జరగలేదని కౌన్సిలర్ హసీనా బేగం వాపోయారు. వైస్ ఛైర్మన్లు నరసింహులు, మహ్మద్ గౌస్ మాట్లాడుతూ... కౌన్సిలర్లు అడిగిన సమస్యలను అధికారులు నిర్లక్ష్యం చేయకుండా సరైన సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. వార్డులో హెల్త్ ఆఫీసర్ పర్యటించే సమయంలో కౌన్సిలర్లకు సమాచారం ఇవ్వాలని సూచించారు. 15 రోజుల్లోగా సమస్యలు పరిష్కరించే దిశగా కృషి చేస్తామని కమిషనర్ కృష్ణ హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు. అజెండాలోని దుకాణాలకు సంబంధించిన అంశం స్పష్టంగా లేదని, వైసిపి కార్యాలయం పేరుతో హౌస్ టాక్స్ వేయడం కుదరదని అధికారుల అభ్యంతరం చెప్పడంతో అంశాన్ని వాయిదా వేశారు. మున్సిపల్ ఇంజినీర్ సత్యనారాయణ, హెల్త్ ఆఫీసర్ సందీప్ కుమార్, అకౌంట్ ఆఫీసర్ రవికుమార్, డిఇలు రాజశేఖర్ రెడ్డి, రామ్మూర్తి, గోపీనాథ్, హౌసింగ్ ఎఇ శివమూర్తి, టిపిఒ బాలమద్దయ్య, రెవెన్యూ ఆఫీసర్ నాసిర్ హుస్సేన్, శానిటేషన్ ఇన్‌స్పెక్టర్లు రవి, నాగరాజు, కౌన్సిలర్లు చలపతి, సురేష్, శాంత, కీర్తన, పద్మావతి, ఇంద, ఇంతియాజ్ ఉన్నారు.

పోడియం ముందు బైఠాయించిన వైసిపి కౌన్సిలర్లు

కూటమితోనే గ్రామాలాభివృద్ధి : ఎమ్మెల్యే

ప్రజాశక్తి - నందవరం

గ్రామంలో సమస్యలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే బీవీ

కూటమితోనే గ్రామాలాభివృద్ధి సాధ్యమని ఎమ్మెల్యే డాక్టర్ బీవీ.జయ నాగేశ్వరరెడ్డి తెలిపారు. సోమవారం ఎమ్మిగనూరు మండలంలోని మల్కాపురం గ్రామంలో ఎమ్మెల్యే డాక్టర్ బీవీ పర్యటించారు. ఈ సందర్భంగా ప్రజలకు స్మార్ట్ రేషన్ కార్డులతో పాటు సూపర్ జిఎస్‌టి-సూపర్ సేవింగ్స్ ప్రతులను పంపిణీ చేశారు. అనంతరం గ్రామ పరిసరాలను సందర్శించి ప్రజలతో సమావేశం నిర్వహించారు. డ్రెయినేజీ వ్యవస్థ, పారిశుధ్య నిర్వహణ, తాగునీటి సరఫరా సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. తాగునీరు, రోడ్లు, పారిశుధ్య సమస్యలపై గ్రామస్తులు ఆయనకు విన్నవించారు. టిడిపి మండల అధ్యక్షులు కెటి.వెంకటేష్ పాల్గొన్నారు.

'చేనేత కుటుంబాలను ఆదుకోవాలి'

ప్రజాశక్తి - నందవరం

చేనేతలతో మాట్లాడుతున్న నాయకులు

వర్షానికి నష్టపోయిన చేనేత కుటుంబాలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆదుకోవాలని ఎపి చేనేత కార్మిక సంఘం తాలూకా కార్యదర్శి బి.కాలప్ప, అధ్యక్ష, ఉపాధ్యక్షులు కె.లక్ష్మన్న, కె.కృష్ణ, సిఐటియు మండల కార్యదర్శి బి.రాముడు, డివైఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు ఎ.సురేష్ డిమాండ్ చేశారు. సోమవారం ఎమ్మిగనూరు పట్టణంలోని 4, 5, 6వ వార్డుల్లో చేనేత కార్మిక సంఘం ఆధ్వర్యంలో చేనేత కుటుంబాలను పరిశీలించారు. ఈనెల 26, 27వ తేదీల్లో కురిసిన భారీ వర్షానికి ఉపాధి లేక పస్తులతో ఉన్న చేనేత కార్మికుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. రెండు, మూడు రోజుల పాటు కురిసిన భారీ వర్షాలతో శివన్న నగర్ ప్రాంతంలో మగ్గంలోకి వర్షపు నీరు చేరుతున్నాయని తెలిపారు. నీటిని తోడేందుకు మోటార్లు ఉపయోగిస్తున్నారని చెప్పారు. ముడి సరుకు, పట్టుచీరలు, జెర్రీ నూలు ధారము దెబ్బతిన్నాయని తెలిపారు. చేనేత కార్మిక కుటుంబాలను ఎమ్మెల్యే, తహశీల్దార్, మున్సిపల్ కమిషనర్ పరిశీలించి ఆదుకోవాలని కోరారు.

ఆస్పరిలో చోరీ

ప్రజాశక్తి - ఆస్పరి

వేలిముద్రలు సేకరిస్తున్న క్లూస్ టీం

ఆస్పరిలో మాల రామాంజిని ఇంట్లో గుర్తు తెలియని వ్యక్తులు చోరీకి పాల్పడ్డారని సిఐ గంగాధర్ తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడారు. చోరీ జరిగిన స్థలానికి చేరుకొని ఇంట్లో తనిఖీ చేపట్టినట్లు తెలిపారు. ఆస్పరికి చెందిన రామాంజిని బతుకుదెరువు కోసం హైదరాబాదుకు వలస వెళ్లారని, పది రోజుల క్రితం వారి సోదరుని గృహ ప్రవేశానికి వచ్చి, ఇంటికి తాళమేసి తిరిగి హైదరాబాద్ వెళ్లారని తెలిపారు. ఆదివారం రాత్రి దుండగులు మూడున్నర తులాల బంగారం, 100 గ్రాముల వెండి అపహరించినట్లు పేర్కొన్నారు. కర్నూలు నుంచి క్లూస్ టీంను పిలిపించి వేలి ముద్రలు తీసుకొని ల్యాబ్‌కు పంపించామన్నారు. రామాంజిని ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

'5న వాల్మీకి జయంతి సభను జయప్రదం చేయండి'

ప్రజాశక్తి- దేవనకొండ

పత్తికొండలో అక్టోబర్ 5న నిర్వహించే వాల్మీకి జయంతి వార్షికోత్సవ సభను జయప్రదం చేయాలని బోయ/వాల్మీకి సమితి రాష్ట్ర అధ్యక్షులు అంజి, వాల్మీకి సీనియర్ నాయకులు కప్పట్రాళ్ల మల్లికార్జున కోరారు. సోమవారం స్థానిక అయ్యప్ప స్వామి దేవాలయంలో వాల్మీకి మండల స్థాయి ప్రత్యేక సమావేశం నిర్వహించారు.

గోడపత్రికలను విడుదల చేస్తున్న వాల్మీకి నాయకులు

ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ప్రాంతీయ అసమానతలు లేకుండా రాష్ట్రవ్యాప్తంగా ఎస్టీ రిజర్వేషన్‌లో వాల్మీకులను చేర్చాలని, 2024 ఎన్నికల ముందు కూటమి హామీ ఇచ్చిందని తెలిపారు. అధికారంలోకి వచ్చి 18 నెలలయినా హామీ అమలు కాలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. వాల్మీకుల ఓట్లతో గెలిచిన ఎమ్మెల్యేలు అసెంబ్లీలో మౌనంగా కూర్చోవడం అన్యాయమన్నారు. వాల్మీకి నాయకులు కరివేముల వీరేష్, వెంకటాపురం లక్ష్మన్న, తెర్నేకల్ చిన్న రాముడు, పరమాల నాగేష్, అలారుదిన్నె సతీష్, షేకన్న, రవికుమార్, గిడ్డయ్య, పరమేష్ పాల్గొన్నారు.

'పెండింగ్ వేతనాలు విడుదల చేయాలి'

ప్రజాశక్తి - కర్నూలు కలెక్టరేట్

ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేస్తున్న శానిటేషన్ వర్కర్లకు, నైట్ వాచ్‌మెన్‌కు పెండింగ్ వేతనాలు విడుదల చేయాలని సిఐటియు నగర ప్రధాన కార్యదర్శి విజయ రామాంజనేయులు డిమాండ్ చేశారు. సోమవారం కలెక్టర్ సిరిని వినతిపత్రం అందజేశారు. ఆయన మాట్లాడుతూ... నాలుగు నెలలుగా నైట్ వాచ్‌మెన్, శానిటేషన్ వర్కర్లకు జీతాలు విడుదల కాలేదన్నారు. విద్యాశాఖాధికారులు స్పందించి వేతనాల చెల్లింపునకు కృషి చేయాలని కోరారు. నగర నాయకులు డి.కుమార్, కృష్ణ పాల్గొన్నారు.

మున్సిపల్ న్యాయ సలహాదారులుగా గురు రాజారావు

ప్రజాశక్తి - నందవరం

ఎమ్మిగనూరు మున్సిపాలిటీ న్యాయ సలహాదారులుగా సీనియర్ న్యాయవాది ఎంకె.గురు రాజారావును నియమిస్తూ మున్సిపల్ ఛైర్మన్ రఘునాథ్ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఆయన పదవీకాలం మూడేళ్లు. గతంలోనూ న్యాయ సలహాదారులుగా పనిచేసిన ఎంకె.గురు రాజారావు లోక్ అదాలత్‌లో మున్సిపాలిటీ తరఫున వేల రూపాయలు మున్సిపాలిటీకి జమ కావడానికి కృషి చేశారు. ఎంకె.గురురాజారావు, ఎస్‌జి.గురు ప్రసాద్, ఎంజి.నర్సారెడ్డి దరఖాస్తు చేసుకొగా, మున్సిపల్ కౌన్సిలర్లు తమ, తమ సిఫార్సులను ఛైర్మన్‌కు సమర్పించారు. గురురాజారావుకు అనుకూలంగా తీర్మానం చేశారు. ఆయన మాట్లాడుతూ... వరుసగా మూడోసారి మున్సిపల్ స్టాండింగ్ కౌన్సిల్‌గా ఎన్నికవడం తనకు గౌరవంగా ఉందని కృతజ్ఞత తెలిపారు. తనపై నమ్మకం ఉంచినందుకు నాయకులకు, కౌన్సిలర్లకు ధన్యవాదాలు తెలిపారు.

ఆరోగ్యంతో కుటుంబం పదిలం

- రజక కార్పొరేషన్ ఛైర్మన్ సావిత్రి

ప్రజాశక్తి - ఆదోని

అనారోగ్య సమస్యలపై ఎప్పటికప్పుడే పరీక్షలు చేయించుకుని ఆరోగ్యాన్ని సంరక్షించుకుంటే కుటుంబం పదిలంగా ఉంటుందని రజక కార్పొరేషన్ ఛైర్మన్ సావిత్రి, మాత, శిశు ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ మధుసూదన రెడ్డి తెలిపారు. సోమవారం మాత, శిశుఆస్పత్రిలో 'స్వస్థ్ నారీ – సశక్త్ పరివార్ అభియాన్' నిర్వహించారు. మహిళలకు ఆరోగ్య సమస్యలపై అవగాహన కల్పించి, ఆరోగ్యం పట్ల తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ఈ సందర్భంగా సావిత్రి మాట్లాడారు. వికసిత్ భారత్‌లో కేంద్ర ప్రభుత్వం మహిళల ఆరోగ్యానికి పెద్దపీట వేస్తూ ఆరోగ్యంగా ఉండేందుకు ప్రత్యేక డ్రైవ్ చేపట్టిందని తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సరఫరా చేసే పౌష్టికాహారాన్ని తప్పకుండా తినాలని, ఆరోగ్యంగా ఉంటారని చెప్పారు. గర్భిణులు కడుపులో పెరుగుతున్న బిడ్డ కోసం పౌష్టికాహారం, తాజా పండ్లు, కూరగాయలు తీసుకోవాలన్నారు. అవగాహన లోపంతో రక్తలేమితో చాలా మంది గర్భిణులు ఇబ్బంది పడుతున్నారని, ఎఎన్ఎం, ఆశా వర్కర్లు సూచించే ఆరోగ్య సూత్రాలను పాటిస్తే ఎలాంటి ఇబ్బందీ ఉండదని తెలిపారు. 20 మంది స్వచ్ఛందంగా రక్తదానం చేశారు. నాయకులు కునిగిరి నీలకంఠ, మహబూబ్ బాష, వాల్మీకి మహాదేవ, మహాదేవ, మహాదేవప్ప పాల్గొన్నారు.

మాట్లాడుతున్న రజక కార్పొరేషన్ ఛైర్మన్ సావిత్రి

రైతులను ఆదుకోవాలి : వైసిపి

ప్రజాశక్తి - కర్నూలు కలెక్టరేట్

వర్షాల వల్ల నష్టపోయిన రైతులను ఆదుకోవాలని వైసిపి నంద్యాల జిల్లా అధ్యక్షులు, మాజీ ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్ రెడ్డి డిమాండ్ చేశారు. సోమవారం ఓర్వకల్లు మండలం హుస్సేనాపురం గ్రామంలో వర్షాల వల్ల నష్టపోయిన పంట పొలాలను పరిశీలించారు. ఆయన మాట్లాడారు. పంట పొలాల్లో నీరు నిల్వ ఉండడం, వర్షానికి పత్తి కాయలు బూజు పట్టాయని తెలిపారు. రైతులను ఆదుకోకపోతే ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు.

చినుకు పడితే చిత్తడే..!

- బురద, నీటిమయంగా బీసీ కాలనీ

ప్రజాశక్తి - నందవరం

రోడ్లు, డ్రెయినేజీలు లేక నందవరం గ్రామం బీసీ కాలనీలో కొన్ని వీధులు దుర్భరంగా మారాయి. చిన్నపాటి వర్షం కురిసినా కాలనీలోని వీధులు బురద, నీటిమయంగా మారుతున్నాయి. 4వ వార్డు పరిస్థితి చాలా అధ్వానంగా ఉంది. డ్రెయినేజీలు లేకపోవడంతో నీరు ఎక్కడికీ వెళ్లే పరిస్థితి లేక ఇళ్ల ముందే నిల్వ ఉంటున్నాయి. బురద, మురుగునీటితో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. నిత్యం విషజ్వరాల బారిన పడుతున్నామని ప్రజలు వాపోతున్నారు. ఇళ్ల ముందు నిలబడడానికి, పశువులను కట్టి వేసుకోవడానికి కూడా ఇబ్బందికరంగా ఉంటుందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వీధి ప్రజలు గ్రామంలోనికి వెళ్లేందుకు ఈ రహదారి ప్రధానమైంది. ఈ ప్రదేశంలో రైతుసేవా కేంద్రాలు, ప్రభుత్వ పాఠశాల, రెండు అంగన్వాడీ కేంద్రాలు ఉన్నాయి. పాఠశాలకు విద్యార్థులు రావటానికి ఇబ్బంది ఎదుర్కొంటున్నారు. వందల మంది విద్యార్థులు చదువుకుంటున్న పాఠశాల, అంగన్వాడీ కేంద్రాల చుట్టూ కలుషితమైన వాతావరణం ఉండడం విద్యార్థుల ఆరోగ్యానికి ఎంతవరకు క్షేమమో అధికారులు, నాయకులు ఆలోచించాలని ప్రజలు అభిప్రాయపడుతున్నారు.

బురదమయంగా మారిన బీసీ కాలనీ

రోడ్లు, డ్రెయినేజీలు నిర్మించాలి

- ఖాసీం, కాలనీ వాసి

చాలా ఏళ్లుగా ఇబ్బందులు పడుతున్నాం. వర్షం కురిస్తే ఇళ్లకే పరిమితమవుతున్నాం. నిత్యం అనారోగ్యాలు సంభవిస్తున్నాయి. ప్రభుత్వం రోడ్లు, డ్రెయినేజీలను నిర్మించి వీధి ప్రజల కష్టాలను తీర్చాలి.

నీరొచ్చి ఇళ్ల ముందు నిల్వ ఉంటోంది

- వీధి ప్రజల ఆవేదన

బీసీ కాలనీలో మా వీధి లోతట్టు ప్రాంతంలో ఉంది. కొన్ని వీధుల్లోని నీరు మొత్తం వచ్చి ఇక్కడ నిల్వ ఉంటున్నాయి. ప్రతేడాది వర్షాకాలం మొత్తం ఇదే పరిస్థితి. ఇళ్ల చుట్టూ మోకాళ్ల లోతు నీరు నిలిచి ఉంటే ఎలా బయటికి వెళ్లాలో అర్థం కాని పరిస్థితి ఏర్పడుతోంది.

రోడ్లు జలమయం

- నాట్లు వేసి సిపిఎం నిరసన

ప్రజాశక్తి - నందవరం

ఎమ్మిగనూరు పట్టణంలో మూడు రోజుల నుంచి కురుస్తున్న వర్షాలతో రోడ్లన్నీ జలమయమయ్యాయని, సంబంధిత మున్సిపల్ అధికారులు నిమ్మకు నేరెత్తినట్లు వ్యవహరిస్తున్నారని సిపిఎం నాయకులు పి.గోవిందు, రమేష్, రైతు సంఘం నాయకులు అబ్దుల్లా, నరసింహులు, సిఐటియు నాయకులు బి.రాజు, డివైఎఫ్ఐ నాయకులు రవికుమార్ విమర్శించారు. సోమవారం రోడ్లపై నాట్లు వేసి నిరసన చేపట్టారు. వారు మాట్లాడుతూ... శిథిలమైన రోడ్ల వల్ల డ్రెయినేజీ సరిగా లేకపోవడం, నూతనంగా రోడ్లను నిర్మించకపోవడం మూలంగా ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారని తెలిపారు. మున్సిపల్ అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదని విమర్శించారు. ఆస్తి, నీటి పన్ను పేరుతో కోట్లాది రూపాయలు వసూలు చేస్తున్నారని, నీటి పన్ను కట్టకపోతే కుళాయిలు కట్ చేస్తున్నారని తెలిపారు. జలమయమైన రోడ్లను బాగు చేయించడంపై ఎందుకు శ్రద్ధ పెట్టడం లేదని మున్సిపల్ అధికారులు, ప్రజాప్రతినిధులను ప్రశ్నించారు. మూడు రోజుల నుంచి కురుస్తున్న వర్షాల వల్ల మగ్గాల గుంతల్లో నీరు చేరి చేనేత కార్మికులు వృత్తిని మానేసి పస్తులతో ఉంటున్నారని తెలిఆరు. ప్రభుత్వ అధికారులు స్పందించి రోడ్లను, డ్రెయినేజీ వ్యవస్థను బాగు చేయించాలని, శివారు కాలనీల్లో తాగునీటి సౌకర్యం కల్పించాలని కోరారు.

రోడ్లపై నాట్లు వేసి నిరసన తెలుపుతున్న నాయకులు

బాధితునికి మాజీ ఎమ్మెల్యే పరామర్శ

ప్రజాశక్తి - నందవరం

బాధితుని పరామర్శిస్తున్న చెన్నకేశవరెడ్డి

ప్రమాదంలో గాయపడిన బాధితుని మాజీ ఎమ్మెల్యే ఎర్రకోట చెన్నకేశవరెడ్డి సోమవారం పరామర్శించారు. నందవరం మండలం నాగలదిన్నె వైసిపి నాయకులు నాగప్ప కొన్ని రోజుల క్రితం రోడ్డు ప్రమాదంలో గాయపడ్డారు. విషయం తెలుసుకున్న ఎర్రకోట చెన్నకేశవ రెడ్డి, వైసిపి నియోజకవర్గ యువ నాయకులు ఎర్రకోట పవన్ కల్యాణ్ రెడ్డి కర్నూలు ఓమ్ని హాస్పిటల్ చేరుకుని పరామర్శించారు. ప్రస్తుత ఆరోగ్య పరిస్థితిపై వైద్యులని అడిగి తెలుసుకున్నారు. ధైర్యంగా ఉండాలని తెలిపారు. కందనాతి వేణుగోపాల్ రెడ్డి, మాణిక్య రెడ్డి, వైసిపి నాగలదిన్నె నాయకులు రాజేష్ శెట్టి, నాగప్ప పాల్గొన్నారు.

ఆ రోడ్డులో ఇబ్బందులే..!

- సిఐటియు ఆధ్వర్యంలో ఆటో డ్రైవర్ల నిరసన

ప్రజాశక్తి - ఆదోని

ఆ రోడ్డులో ఆటోలు తిప్పాలంటే ఇబ్బందులేనని, మరమ్మతులు చేయించాలని ఆటో డ్రైవర్లు కోరారు. సోమవారం సబ్ కలెక్టర్ కార్యాలయం ముందు ఆటో డ్రైవర్లు సిఐటియు ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. ఆర్అండ్‌బి ఈఈ పద్మనాభయ్యకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆర్అండ్‌బి ఈఈ పద్మనాభయ్య మాట్లాడారు. ధణాపురం నుంచి హోళగుంద వరకు రోడ్డు కోసం రూ.7 కోట్లు మంజూరయ్యాయని, టెండర్ ప్రాసెస్ జరుగుతోందని, త్వరలోనే పనులు జరుగుతాయని తెలిపారు. ఆటో యూనియన్ నాయకులు మాట్లాడుతూ... రోడ్డు వేయిస్తామని ఏడేళ్లుగా చెబుతూనే ఉన్నారని, నిర్లక్ష్యం చేస్తే ఆటోలతో ర్యాలీ నిర్వహిస్తామని హెచ్చరించారు. రెండు రోజుల్లో తాత్కాలిక మరమ్మతులు చేపడతామని ఈఈ హామీ ఇవ్వడంతో ఆందోళనను విరమించారు. సిఐటియు మండల కార్యదర్శి వీరారెడ్డి, నాయకులు లింగన్న, రామాంజనేయులు, నాగనాథనహళ్లి ఆటో డ్రైవర్లు పాల్గొన్నారు.

వినతిపత్రం అందజేస్తున్న నాయకులు, ఆటో డ్రైవర్లు

రైతులకు అందుబాటులో యూరియా : టిడిపి

ప్రజాశక్తి - గోనెగండ్ల

రైతులకు యూరియా అందుబాటులో ఉందని టిడిపి నాయకులు తెలిపారు. సోమవారం గోనెగండ్ల రైతు సేవా కేంద్రాల్లో సర్పంచి పూజారి హైమావతి, టిడిపి మండల కన్వీనర్ తిరుపతయ్య నాయుడు, సింగిల్ విండో ప్రెసిడెంట్ ఎన్‌వి.రామాంజనేయులు రైతులకు యూరియాను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. కూటమి ప్రభుత్వం రైతులకు పుష్కలంగా యూరియా అందిస్తుంటే, యూరియా అందడం లేదని వైసిపి నాయకులు దుష్ప్రచారం చేయడం సరికాదని తెలిపారు. యూరియా ఒక బస్తా రూ.270లకే అందిస్తున్నట్లు చెప్పారు. వ్యవసాయ సిబ్బంది షఫీ, టిడిపి నాయకులు డీలర్ పక్రుద్దీన్, కాంట్రాక్టర్ షేక్షావలీ, అక్బర్ వలీ, మేకల మునెప్ప, కోటేకల్ రఫీక్ పాల్గొన్నారు.

యూరియా పంపిణీ చేస్తున్న సర్పంచి హైమావతి, నాయకులు

నిర్లక్ష్యం చేస్తే ఆందోళన తీవ్రతరం

- సచివాలయ ఉద్యోగుల నిరసన

ప్రజాశక్తి - ఆదోని

సమస్యలు పరిష్కరించకుండా ప్రభుత్వం తమ సహనాన్ని పరీక్షిస్తోందని, ఇలాగే వ్యవహరిస్తే ఆందోళన తీవ్రతరం చేస్తామని సచివాలయ ఉద్యోగులు హెచ్చరించారు. సోమవారం ఆదోనిలో అంబేద్కర్ విగ్రహం ముందు నిరసన చేపట్టి, విగ్రహానికి వినతిపత్రం ఇచ్చారు. సచివాలయ ఉద్యోగుల జెఎసి నాయకులు రవి, రామాంజినేయులు, వెంకప్ప మాట్లాడారు. ఈ నెల పింఛన్లను ఇంటింటికీ తిరిగి ఇవ్వకుండా కార్యాలయంలోనే 10 గంటల నుంచి 5 వరకు పంపిణీ చేస్తామని తెలిపారు. రెండు నోషనల్ ఇంక్రిమెంట్లు ఇవ్వాలని, ఆరేళ్లు పూర్తి చేసుకున్న ఉద్యోగులకు ఆటోమేటిక్ అడ్వయిస్ స్కీమ్ వర్తింపజేయాలని కోరారు.

అంబేద్కర్ విగ్రహం ముందు నిరసన చేపడుతున్న ఉద్యోగులు

కార్యకర్తలకు వైసిపి అండ : నాయకులు

గోడపత్రికలను విడుదల చేస్తున్న నాయకులు

ప్రజాశక్తి - నందవరం

కార్యకర్తలకు వైసిపి అండగా నిలుస్తుందని రాష్ట్ర మేధావుల ఫోరం సంయుక్త కార్యదర్శి కెఆర్.లక్ష్మికాంత్ రెడ్డి, బీసీ సెల్ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి విరుపాక్షి రెడ్డి, వైసిపి సీనియర్ నాయకులు కెఆర్.రామకోటేశ్వర్ రెడ్డి, జడ్‌పిటిసి నిఖిల్ చక్రవర్తి తెలిపారు. మండల కన్వీనర్ జె.శివారెడ్డి నివాసంలో వైసిపి ఇన్‌ఛార్జీ, మాజీ ఎంపీ బుట్టా రేణుక ఆదేశాల మేరకు 'డిజిటల్ బుక్ క్యూఆర్ కోడ్' గోడపత్రికను విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. 15 నెలలుగా అక్రమ కేసుల నమోదు, పోలీసు స్టేషన్లలోనే కార్యకర్తలపై కేసులు నమోదు చేయడం, సోషల్ మీడియాలో వ్యతిరేక అభిప్రాయాలను నిషేధించడం, తప్పుడు కేసుల ద్వారా దౌర్జన్యానికి పాల్పడడం వంటి పరిణామాలను తీవ్రంగా విమర్శించారు. డిజిటల్ బుక్ ద్వారా ఈ వివరాలను ప్రజలకు చేరవేయడం మాత్రమే కాక, కార్యకర్తలకు ధైర్యం, ఆత్మవిశ్వాసాన్ని అందించడమే లక్ష్యమని తెలిపారు. మాజీ ముఖ్యమంత్రి జగన్ ప్రజల సంక్షేమం కోసం మొదటి రోజు నుంచే పోరాటం చేస్తున్నారని, గత ఎన్నికల్లో వైసిపికి 40 శాతానికిపైగా ఓట్లు వచ్చినప్పటికీ అసెంబ్లీలో ప్రతిపక్ష హోదా నిరాకరించడం రాజకీయ న్యాయాన్ని ధిక్కరించే చర్య అని విమర్శించారు. అసెంబ్లీలో తమ నాయకుని 'సైకో' అని పిలవడం బాధాకరమని తెలిపారు.

పేదల సంక్షేమమే కూటమి లక్ష్యం

- మాజీ జడ్‌పిటిసి మీనాక్షి నాయుడు

ప్రజాశక్తి - చిప్పగిరి

నిరుపేదలకు సంక్షేమ పథకాలను అందించడమే కూటమి ప్రభుత్వం లక్ష్యమని మాజీ జడ్‌పిటిసి, టిడిపి సీనియర్ నాయకులు మీనాక్షి నాయుడు తెలిపారు. సోమవారం ఏరూరు గ్రామంలో స్మార్ట్ రేషన్ కార్డులను లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. నిరుపేదలందరికీ ఏదో ఒక రూపంలో ఆర్థిక చేయూత అందించడమే ముఖ్యమంత్రి చంద్రబాబు ధ్యేయమన్నారు. రాబోయే కాలంలో ప్రజలకు మరిన్ని సంక్షేమ పథకాలను అందించేందుకు కృషి చేస్తున్నట్లు తెఇపారు. మాజీ ఎంపిటిసి నరసింహులు, టిడిపి నాయకులు మిరపకాయల చంద్ర, రేషన్ డీలర్ రాము, ముని పాల్గొన్నారు. **హాలహర్వి** మండలంలో అన్ని గ్రామాల్లోనూ టిడిపి ఇన్‌ఛార్జీ వైకుంఠం జ్యోతి ఆదేశాల మేరకు టిడిపి నాయకులు, విఆర్ఒల ఆధ్వర్యంలో స్మార్ట్ రేషన్ కార్డులను పంపిణీ చేశారు. విఆర్ఒ ఖాసీం, అసుండి శ్రీధర్, నాగరాజు, మల్లికార్జున పాల్గొన్నారు. **కౌతాళం** మండలం ఉరుకుంద గ్రామంలో స్మార్ట్ రేషన్ కార్డులను పంపిణి చేశారు. టిడిపి జిల్లా కార్యనిర్వహక కార్యదర్శి కొట్రేష్ గౌడ్, టిడిపి జిల్లా బీసీ సెల్ అధ్యక్షులు కురుగోడు, సర్పంచి టి.రవి, టిడిపి నాయకులు నరసింహులు, హుస్సేని, శివప్ప గౌడ్, వీరేష్ పాల్గొన్నారు.

చిప్పగిరిలో కార్డులను పంపిణీ చేస్తున్న మీనాక్షి నాయుడు

కౌతాళం : కార్డులను పంపిణీ చేస్తున్న నాయకులు

స్మార్ట్ రేషన్ కార్డులు పంపిణీ

ప్రజాశక్తి - క్రిష్ణగిరి

మండలంలోని పుట్లూరు గ్రామంలో ఎమ్మెల్యే కెఇ.శ్యాం కుమార్ ఆదేశాల మేరకు సోమవారం టిడిపి నాయకులు రాముడు, శ్రీరాములు, డీలర్ కృష్ణ స్మార్ట్ రేషన్ కార్డులను పంపిణీ చేశారు. వారు మాట్లాడారు. నిత్యావసర సరుకులను తీసుకునేందుకు స్మార్ట్ రేషన్ కార్డులను అందుబాటులోకి తీసుకొచ్చినట్లు తెలిపారు.

IN THE COURT OF THE HON'BLE
IInd. ADDITIONAL DISTRICT JUDGE ::
KURNOOL AT ADONI.
O.S. No. 21/2016.

Between:
S.Abdul Khadar & 4 others. ...Plaintiffs.
AND
Devisetty Chenna Basappa (Died) by L.Rs., and others. ...Defendants.

SUMMONS TO DEFENDANT No. 6.

To
Siddalingeswara, (D-6),
Son of Late D. Chenna Basappa @ Chennappa, Hindu, aged 45 years, H. No. (21/26) / 3,5th Roiad, S.K.D. Colony, ADONI-518 301.

Whereas the above named Plaintiffs have filed a suit against the Defendants for Specific Performance in regard to executing a Regd. Sale Deed in favour of the Plaintiffs.

Hence, you are hereby directed to appear in-person or through your Advocate on 29-10-2025 at 10.30 A.M. before this Hon'ble Court. Failing which the matter will be decided on merits.

BY ORDER OF THE COURT
K.MD. MAZHARUL HUQ,
ADVOCATE, ADONI.

IN THE COURT OF THE HON'BLE
IInd. ADDL. DISTRICT JUDGE
KURNOOL AT ADONJ.
I.A. No. 76/2025 in 0.5. No. 7/2023.

Between:
Gadige Gopal (Died) by L.Rs. Smt. g. Nagaveni & two others. ...Petitioners.
AND
Gadige Chennappa & others. ...Respondents.

To
8.G. Lalitha D/o Gadige Nagappa, aged 46 years, R/o H.No. 10/238, Mallari Street, Yemmiganur.
9. G. Bhagyalakshmi, D/o Gadige Nagappa, aged 44 years, R/o H.No. 10/238, Mallari Street, Yemmiganur.
10. G. Sujatha, D/o Gadige Nagappa, aged 42 years, R/o H.No. 10/238, Mallari Street, Yemmiganur.

NOTICE TO RESPONDENTS

Whereas the above named Petitioners have filed a petition U/Sec. 5 of Limitation Act, for condoning the delay of 225 days i.e., from 22-07-2024 to 04-03-2025 in filing the L.R. Petition of D-4 in the above suit.

You are hereby directed to appear before this Hon'ble Court on or before 15-10-2025 at 10.30 A.M. in-person or through your Counsel. Failing which, the matter will be decided on merits.

By order of the Court.
K.Md. Mazharul Huq,
Advocate for D.Hr.
ADONI

IN THE COURT OF THE HON'BLE
Ind. ADDL. DISTRICT JUDGE ::
KURNOOL AT ADONI.
I.A. No. 78/2025 in O.S. No. 7/2023.

Between:
Gadige Gopal (Died) by L.Rs.
Smt. g. Nagaveni & two others. ...Petitioners.
AND
Gadige Chennappa & others. ...Respondents.

To
8. G. Lalitha D/o Gadige Nagappa, aged 46 years, R/o H.No. 10/238, Mallari Street, Yemmiganur.
9. G. Bhagyalakshmi, D/o Gadige Nagappa, aged 44 years, R/o H.No. 10/238, Mallari Street, Yemmiganur.
10. G. Sujatha, D/o Gadige Nagappa, aged 42 years, R/o H.No. 10/238, Mallari Street, Yemmiganur.

NOTICE TO RESPONDENTS

Whereas the above named Petitioners have filed a petition under Ord. XXII, Rule-4 of C.P.C. for permitting the Petitioners to add the Legal Heirs of D-4 as D-8 to D-10 to the above case as shown in the Consequential Amendment in the above suit.

You are hereby directed to appear before this Hon'ble Court on or before 15-10-2025 at 10.30 A.M. in-person or through your Counsel. Failing which, the matter will be decided on merits.

By order of the Court,
K.Md. Mazharul Huq,
Advocate for D.Hr. ADONI

IN THE COURT OF THE HON'BLE
IInd. ADDL. DISTRICT JUDGE ::
KURNOOL AT ADONI.
I.A. No. 77/2025 in O.S. No. 7/2023.

Between:
Gadige Gopal (Died) by L.Rs. Smt. G. Nagaveni & two others. ...Petitioners.
AND
Gadige Chennappa & others. ...Respondents.

To
8.G. Lalitha D/o Gadige Nagappa, aged 46 years, R/o H.No. 10/238, Mallari Street, Yemmiganur.
9. G. Bhagyalakshmi, D/o Gadige Nagappa, aged 44 years, R/o H.No. 10/238, Mallari Street, Yemmiganur.
10. G. Sujatha, D/o Gadige Nagappa, aged 42 years, R/o H.No. 10/238, Mallari Street, Yemmiganur.

NOTICE TO RESPONDENTS.

Whereas the above named Petitioners have filed a petition under Ord. XXII, Rule-9 of C.P.C. for setting aside the order of abatement of the aboe suit in filing the L.R. Petition of D-4, in the above suit.

You are hereby directed to appear before this Hon'ble Court on or before 15-10-2025 at 10.30 A.M. in-person or through your Counsel. Failing which, the matter will be decided on merits.

By order of the Court.
K.Md. Mazharul Huq,
Advocate for D.Hr.
ADONI.

వ్యాధులపై అవగాహన అవసరం

- 'రాష్ట్రీయ బాలస్వాస్త్య' అధికారి మహేశ్వర ప్రసాద్

ఎమ్మెల్యే గౌరు చరితతో మాట్లాడుతున్న మహేశ్వర ప్రసాద్

ప్రజాశక్తి - కర్నూలు హాస్పిటల్

జంతువుల నుంచి మనుషులకు సంక్రమించే వ్యాధులపై అవగాహన అవసరమని రాష్ట్రీయ బాల స్వాస్త్య కార్యక్రమ అధికారి డాక్టర్ మహేశ్వర ప్రసాద్ తెలిపారు. సోమవారం లక్ష్మీపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వ్యాధులపై అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ... పెంపుడు జంతువులు, పక్షులు, పశువులను తాకినప్పుడు చేతులను శుభ్రంగా కడుక్కోవాలని తెలిపారు. కుక్క, పిల్లి, ఎలుకలు, పందికొక్కులతో పాటు ఏదైనా జంతువు కరిచినా, గోళ్లతో రక్కినా గాయాలను నీటిధార కింద సబ్బుతో శుభ్రం చేయాలని, గోరు వెచ్చని నీటిని గాయంపై పోయాలని సూచించారు. సమీపంలో ఉన్న ప్రభుత్వాస్పత్రికి వెళ్లి రేబిస్ టీకా వేయించుకోవాలన్నారు. వైద్యులు డాక్టర్ జ్యోతి, ఫ్లోరోసిస్ కన్సల్టెంట్ సుధాకర్ పాల్గొన్నారు.

మైపర్, కిమ్స్ హాస్పిటల్స్ ఆధ్వర్యంలో

ప్రపంచ గుండె దినోత్సవ ర్యాలీ

ప్రజాశక్తి - కర్నూలు హాస్పిటల్స్

ప్రపంచ గుండె దినోత్సవం సందర్భంగా మైపర్, కిమ్స్ హాస్పిటల్స్ ఆధ్వర్యంలో సోమవారం 'హార్ట్ వాక్' ర్యాలీ నిర్వహించారు. ఈఏడాది నినాదం 'డోంట్ మిస్ ఎ బీట్ - బి ఎ హార్ట్ హీరో'గా కొనసాగింది. అశోక స్థూపం (కలెక్టరేట్) నుంచి ర్యాలీని ప్రారంభించి కిసాన్ ఘాట్ ఆర్చ్ వరకు కొనసాగించారు. కలెక్టర్ డాక్టర్ ఎ.సిరి ముఖ్య అతిథిగా హాజరై ర్యాలీని ప్రారంభించారు. మైపర్ కళాశాల వ్యవస్థాపకులు, డైరెక్టర్ డాక్టర్ ఆదిమూలపు సతీష్ మాట్లాడుతూ... ప్రస్తుతం గుండె సంబంధిత వ్యాధులు పెరుగుతున్న దృష్ట్యా ప్రజలు జీవనశైలిలో మార్పులు చేసుకోవాలని తెలిపారు. సమతుల ఆహారం, రోజూ వ్యాయామం, ఒత్తిడి తగ్గించడం, తరచూ ఆరోగ్య పరీక్షలు చేయించుకోవడం ముఖ్యమని సూచించారు.

విద్యుదాఘాతంతో రెండు ఎద్దులు మృతి

ప్రజాశక్తి - క్రిష్ణగిరి

విద్యుదాఘాతంతో ఎద్దులు మృతి చెందిన సంఘటన క్రిష్ణగిరి మండలం చుంచు ఎర్రగుడి గ్రామంలో సోమవారం చోటు చేసుకుంది. చుంచు ఎర్రగుడి గ్రామానికి చెందిన కురువ గిడ్డయ్య ఎద్దులతో పాటు గేద, దూడ, రెండు పొట్టేళ్లు మృత్యువాత పడ్డాయి. ఆదివారం రాత్రి వర్షం కురవడంతో గ్రామంలో ఉన్న వారి పొలం దగ్గర రేకుల షెడ్డులో విద్యాదాఘాతంతో ఎద్దులు, గేద, దూడ, రెండు పొట్టేళ్లు మృతి చెందాయి. వీటి విలువ దాదాపు రూ.3 లక్షలు ఉంటుందని రైతు వాపోయారు. పశుసంవర్ధక శాఖ, విద్యుత్ శాఖ అధికారులకు, పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు గ్రామస్తులు తెలిపారు. రైతుకు నష్ట పరిహారం అందించాలని కోరారు.

ఎంపీని కలిసిన స్వప్న

ఎంపీ నాగరాజును కలిసిన స్వప్న

ప్రజాశక్తి - కర్నూలు క్రైమ్

కర్నూలు ఎంపీ బస్తిపాటి నాగరాజును రాష్ట్ర వీరశైవ లింగాయత్ కార్పొరేషన్ ఛైర్మన్ తుల్జాపూర్ స్వప్న మర్యాదపూర్వకంగా కలిశారు. సోమవారం నగరంలోని ఎంపీ కార్యాలయంలో ఆయనను కలిసి శాలువాతో సన్మానించారు. ఆమె మాట్లాడుతూ... వీరశైవులను ఓబీసీలో చేర్చేలా కృషి చేయాలని ఎంపీని కోరారు. వీరశైవ ఐక్య వేదిక రాష్ట్ర అధ్యక్షులు మల్లికార్జున, ఉపాధ్యక్షులు చంద్రశేఖరప్ప పాల్గొన్నారు.

సూపర్ జిఎస్‌టిపై అవగాహన కల్పించాలి

- కమర్షియల్ ట్యాక్స్ శాఖ డిఇఒ రమాదేవి

ప్రజాశక్తి -కోడుమూరు

సూపర్ జిఎస్‌టి సేవింగ్స్‌పై ప్రజలకు వివరించాలని కమర్షియల్ టాక్స్ డిపార్ట్‌మెంట్ డిఇఒ రమాదేవి తెలిపారు. సోమవారం ఎంపిడిఒ కార్యాలయంలో సూపర్ జిఎస్‌టి-సూపర్ సేవింగ్స్‌పై మండల స్థాయి అధికారులకు, సచివాలయం సిబ్బందికి అవగాహన కల్పించారు. తహశీల్దార్ నాగరాజు, ఎంపిడిఒ ఎసి.రాముడు హాజరయ్యారు.

కమిషనర్ విశ్వనాథ్‌ను కలిసిన రవీంద్ర విద్యాసంస్థల యాజమాన్యం

నగరాభివృద్ధిలో 'రవీంద్ర' భాగస్వామ్యం

ప్రజాశక్తి - కర్నూలు కార్పొరేషన్

నగర సుందరీకరణలో తమ సంస్థ తరపున సహకారం అందించేందుకు సిద్ధంగా ఉన్నామని రవీంద్ర విద్యాసంస్థల వ్యవస్థాపకులు జి.పుల్లయ్య, ఛైర్మన్ జివిఎం.మోహన్ కుమార్, సిఇఒ జి.గోపీనాథ్, వైస్ ఛైర్మన్ జి.వంశీధర్ తెలిపారు. సోమవారం మున్సిపల్ కమిషనర్ పి.విశ్వనాథ్‌ను కలిశారు. నగరాన్ని వైజాగ్ వంటి మహానగరాల సరసన నిలిపే లక్ష్యంతో పెట్టుబడిదారులు ముందుకు రావాలని కమిషనర్ కోరారు.

కార్యకర్తలకు అండగా డిజిటల్ బుక్ : వైసిపి

డిజిటల్ బుక్‌ను విడుదల చేస్తున్న నాయకులు

ప్రజాశక్తి - క్రిష్ణగిరి

రాష్ట్రంలో అన్యానికి గురైన వైసిపి కార్యకర్తలకు డిజిటల్ బుక్ అండగా ఉంటుందని మాజీ ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి, క్రిష్ణగిరి మండల అధ్యక్షులు డాక్టర్ కంగాటి వెంకటరామిరెడ్డి తెలిపారు. సోమవారం వైసిపి మండల ఉపాధ్యక్షులు బి.సుభాష్, కోఆప్షన్ సభ్యులు చిన్న శాలు క్రిష్ణగిరిలో డిజిటల్ బుక్ స్కానర్‌లను విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. అన్యాయాలపై ప్రశ్నించినందుకు కేసులు పెట్టినా భయపడాల్సిన అవసరం లేదన్నారు. వెంటనే డిజిటల్ బుక్‌లో రిజిస్టర్ చేసుకోవాలని కోరారు. జయరామిరెడ్డి, రామళ్లకోట హుస్సేన్ సాహెబ్, చిన్నయ్య యాదవ్, శేఖర్, బందెల హనుమంతు, వడ్డే రాజు, పడిగ బాలమద్దిలేటి పాల్గొన్నారు.

పారిశు ధ్య పనులను సక్రమంగా చేపట్టాలి

- ఎంపిడిఒ రాముడు

ప్రజాశక్తి- కోడుమూరు

పట్టణంలో రోజూ ఇంటింటి చెత్త సేకరణను సక్రమంగా చేపట్టాలని ఎంపిడిఒ ఎసి.రాముడు ఆదేశించారు. సోమవారం పారిశుధ్య నిర్వహణలో భాగంగా కోడుమూరు పంచాయతీ పరిధిలోని బుడగ జంగాల కాలనీలో పర్యవేక్షించారు. అలాగే సుందరయ్య నగర్‌లో కూడా డ్రెయినేజీలను సందర్శించారు. సంత మార్కెట్ సమీపంలోని స్కూల్ దగ్గర డ్రెయినేజ్ బ్లాక్ అయి మురుగునీరు రోడ్డుపైకి వస్తోందని, సమస్య పరిష్కారానికి సిబ్బందితో పారిశుధ్య నిర్వహణను సక్రమంగా నిర్వర్తించాలని ఆదేశించారు. శానిటేషన్ ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వర్లు పంచాయతీలో జరిగే పారిశుధ్య నిర్వహణలో కార్మికులకు సలహాలు ఇస్తూ పర్యవేక్షించాలని తెలిపారు.

శ్మశాన వాటికకు ప్రహరీ నిర్మించాలి

- మంత్రి ఫరూక్‌ను కోరిన విష్ణువర్ధన్ రెడ్డి


మంత్రితో మాట్లాడుతున్న విష్ణువర్ధన్‌రెడ్డి

ప్రజాశక్తి-కోడుమూరు

ముస్లిం శ్మశాన వాటికకు ప్రహరీ, సిసి రోడ్డు ఏర్పాటు చేయాలని టిడిపి సీనియర్ నాయకులు, కెడిసిసి ఛైర్మన్ డి.విష్ణువర్ధన్ రెడ్డి కోరారు. సోమవారం న్యాయశాఖ మంత్రి ఎన్ఎమ్‌డి.ఫరూక్‌ను వారి కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. శ్మశాన వాటికకు ప్రహరీ, సిసి రోడ్డుకు అంచనా వేయించి శ్మశాన వాటిక సమస్యను వివరించారు. సమస్యను విన్న మంత్రి ఫరూక్, ప్రహరీ, సిసి రోడ్డుకు అంచనా వేయించి ప్రభుత్వం ద్వారా నిధులు విడుదల చేయిస్తానని హామీ ఇచ్చారు. జిడిపి ఛైర్మన్ మల్లికార్జున గౌడ్, కోడుమూరు మార్కెట్ యార్డ్ వైస్ ఛైర్మన్ ఎల్లప్ప నాయుడు, టిడిపి పట్టణ అధ్యక్షులు, సింగిల్ విండో డైరెక్టర్ గంగాధర్ నాయుడు, టిడిపి మండల ప్రధాన కార్యదర్శి రాజు, దావుద్ బాషా, ఇంతియాజ్ బాషా, నిహార్, లక్ష్మన్న పాల్గొన్నారు.